
www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 16 జులై 2024

5

తిరుపతి



పవన్ కళ్యాణ్‌తో ఎమ్మెల్యే భేటీ



ప్రజాశక్తి- తిరుపతి సిటీ: జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు సోమవారం మంగళగిరిలో కలిసి దుస్సాలవతో సత్కరించారు. జనసేన ప్రజాప్రతినిధుల సమావేశం మంగళగిరిలో పవన్ కళ్యాణ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తోటి ప్రజాప్రతినిధులను శాలువాతో సన్మానించి, పవన్ కళ్యాణ్‌కు కూరగాయల బుట్టని ఇచ్చి సత్కరించారు.

కలుషిత ఆహారం తిని

121 మంది విద్యార్థులకు అస్వస్థత

- బాధ్యులపై కఠినచర్యలు తీసుకుంటాం : మంత్రి
- పరిస్థితి సమీక్షిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యేలు
- విద్యార్థులను పరామర్శించిన సిపిఎం నాయకులు





గురుకుల పాఠశాలను పరిశీలిస్తున్న మంత్రి, కలెక్టర్ - ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శిస్తున్న మంత్రి

ప్రజాశక్తి- నాయుడుపేట, గూడూరు టౌన్: తిరుపతి జిల్లా నాయుడుపేట పట్టణంలోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ బాలుర గురుకుల పాఠశాలలో ఆదివారం 121 మంది విద్యార్థులు కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురయ్యారు. గురుకుల పాఠశాలలో శనివారం రాత్రి చేసిన పూరీలను విద్యార్థులకు ఆదివారం ఉదయం పెట్టారు, మధ్యాహ్నం చికెన్ పెట్టారు. దీంతో 121 మంది విద్యార్థులకు వాంతులు, విరోచనాలై అస్వస్థతకు గురయ్యారు. అస్వస్థతకు గురైన విద్యార్థులను నాయుడుపేట, గూడూరు, సూళ్లూరుపేట ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి శ్రీహరి గురుకుల పాఠశాలకు చేరుకుని విద్యార్థుల ఆరోగ్యపరిస్థితులను తెలుసుకున్నారు. పిల్లల తల్లిదండ్రులతో చర్చించి విద్యార్థులకు ఎలాంటి అపాయం జరగదని భరోసా ఇచ్చారు. నాయుడుపేట కమ్యూనిటీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించి, మెరుగైన చికిత్స



అందించాలని వైద్యాధికారులను కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్, ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అక్కడే ఉండి పరిస్థితి సమీక్షిస్తున్నారు.

విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలి: మంత్రి

గూడూరు టౌన్: గూడూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న 30 మంది విద్యార్థులను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా బాలవీరాంజనేయ స్వామి పరామర్శించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల ఆరోగ్యం నిలకడగా ఉందన్న డాక్టర్లు తెలుపగా విద్యార్థులకు మెరుగైన ఆరోగ్యం అందించాలని వైద్యులకు సూచించారు. మంత్రితోపాటు కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యేలు విజయశ్రీ, పాశిం సునీల్ కుమార్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించారు. మంత్రి మాట్లాడుతూ ఈ సంఘటనకు సంబంధించి జాయింట్ కలెక్టర్‌తో కమిటీ వేస్తున్నామని, విచారణ జరిపించి నివేదిక ఆధారంగా దీనికి కారణమైన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. వసతి గృహాల్లో మెరుగైన వసతులు ఏర్పాటు చేస్తామని ఇటువంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. రాష్ట్రంలో ఎక్కడ ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపడతామని మంత్రి తెలిపారు. విద్యార్థుల పట్ల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ అస్వస్థతకు గురైన విద్యార్థులను నాయుడుపేట, సూళ్లూరుపేట, గూడూరు, నెల్లూరులో చికిత్స అందిస్తున్నామని పాఠశాలలో కొన్ని సమస్యలు గుర్తించామని వాటిని త్వరలో పరిష్కరిస్తామని పేర్కొన్నారు. పిల్లల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందన్నారు. ఇటీవల పలు గురుకుల పాఠశాలలో అనేక సంఘటనలు జరిగాయని విచారణ జరిపించి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలి: ఎస్ఎఫ్ఐ

క్యాంపస్: నాయుడుపేటలోని గురుకుల పాఠశాలలో కలుషిత ఆహారం తిని విద్యార్థులు అస్వస్థతకు గురై ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారని, ఇది ముమ్మాటికీ జిల్లా అధికార యంత్రాంగం నిర్లక్ష్యమే అని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రవి, అధ్యక్షులు అక్బర్ విమర్శించారు. జూన్ నెల విద్యా సంవత్సరం ప్రారంభంలోనే ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీగా తిరుపతి జిల్లా జేసీకి హాస్టల్ సమస్యలపై, గురుకుల సమస్యలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి విద్యార్థుల ఆరోగ్యలను కాపాడాలని, సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం ఇచ్చినట్లు వివరించారు. కానీ అధికారులు పైపైన చర్యలు తప్ప సమగ్రంగా సమస్యల పరిష్కారించేలా చర్యలు చూపకపోవడం వల్లే గురుకుల విద్యార్థులు అవస్థలు పడుతున్నారని అన్నారు. డక్కిలిలో డెంగీతో విద్యార్థి మృతి, నాయుడుపేటో 121 మంది విద్యార్థులకు అస్వస్థతకు గురై పరిస్థితి విషమించే వరకూ అధికారులు కదిలే పరిస్థితి లేదన్నారు. ఇకనైనా జిల్లా యంత్రాంగం కదిలి పేద విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని కోరారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహించిన వార్డెన్, ప్రిన్సిపాల్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు

అస్వస్థతకు గురైన విద్యార్థులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు కోరారు. గూడూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను ఆయన పరామర్శించి, జరిగిన ఘటనపై ఆరా తీశారు. గురుకుల పాఠశాలల్లో తరచూ ఇటువంటి ఘటనలు జరుగుతూనే ఉన్నాయని సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని, దీనికి కారణమైన వారిపై చర్యలు చేపట్టాలని కోరారు. గురుకులాల్లో మెరుగైన వసతులు కల్పించాలన్నారు. వారి వెంట నాయకులు జోగి శివకుమార్, సురేష్, శ్రీనివాసులు, ప్రసాద్ ఉన్నారు.



గూడూరులో విద్యార్థులను పరామర్శిస్తున్న వందవాసి నాగరాజు

బాధ్యతలు స్వీకరించిన ఎస్పీ



ప్రజాశక్తి- తిరుపతి సిటీ: జిల్లా ఎస్పీగా ఎల్.సుబ్బరాయుడు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా జిల్లా ఎస్పీకి జిల్లా అదనపు ఎస్పీలు పుష్పగుచ్చాలు అందజేసి ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు మాట్లాడుతూ తిరుపతి ఒక ప్రతిష్ఠాత్మకమైన జిల్లా అని, అనునిత్యం శ్రీవారి దర్శనార్థం ఇక్కడికి భక్తులు వస్తుంటారని, వారికి ఎలాంటి సమస్యలు లేకుండా శాంతి భద్రతలను కాపాడుతామన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసం మంచి పోలీసింగ్ విధానాన్ని అమలు చేసి, పోలీస్‌శాఖ ప్రతిష్టను పెంపొందించే విధంగా పనిచేస్తామన్నారు. చట్టానికి లోబడి పోలీస్ శాఖ పనిచేస్తుందని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు, మీడియా, ప్రజాప్రతినిధుల సహకారంతో సమర్థవంతంగా శాంతిభద్రతలను కాపాడుతామని తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీలు వెంకట్రావు, కులశేఖర్, విమల కుమారి, జిల్లాలోని డిఎస్పీలు, సిఐలు, ఆర్ఐలు, ఎస్సైలు, ఆర్ఎస్ఐలు, జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బంది పాల్గొని జిల్లా ఎస్పీకి ఘనంగా స్వాగతం పలికారు. తిరుపతి జిల్లా నూతన ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన సుబ్బరాయుడుని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తిరుపతి లోని ఎస్పీ కార్యాలయంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్పీకి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. నూతన ఎస్పీ ఎల్.సుబ్బరాయుడును చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి, పుష్ప గుచ్ఛము అందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఎస్పీని కలిసిన జిల్లా ప్రజారవాణా అధికారి

తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బారాయుడును జిల్లా ప్రజా రవాణా అధికారి చెంగల్ రెడ్డి మర్యాదపూర్వ కలిసి, శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతో పాటు డిప్యూటీ సిటిఎం భాస్కర్ రెడ్డి కూడా హాజరై దుస్సాలతో ఎస్పీని సత్కరించారు.



జిల్లాలో ముసురు వర్షం

- కోట మండలంలో అత్యధికంగా 22.12 మిల్లీమీటర్ల వర్షపాతం నమోద్య

ప్రజాశక్తి- తిరుపతి టౌన్

బంగాళాఖాత అల్పపీడనం ప్రభావంతో గత రెండు రోజులుగా తిరుపతి జిల్లాలో ముసురు వర్షాలు కురుస్తున్నాయి. అత్యధికంగా కోట మండలంలో 26.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా బిఎన్ కండ్రిగ 22.2, బాలాయపల్లి 9.8, తిరుపతి అర్బన్ 8.6, నాగలాపురం 8.6, వాకాడు 8.2, ఏర్పేడు 8.2, శ్రీకాళహస్తి 7.6, చిట్టమూరు,తొట్టంబేడు 7.4, రేణిగుంట 7.2, గూడూరు 5.6, చిల్లకూరు 5.2, ఓజిలి 5.2, వెంకటగిరి 5.2, దక్కిలి,పాకాల 4.2, దొరవారి సత్రం 3.6, వడమలపేట, తడ 3.4 పెళ్లకూరు, చిన్నగొట్టిగల్లు 3.2, నారాయణవనం 3.0, చంద్రగిరి, రామచంద్రపురం 2.8, నాయుడుపేట 2.6, ఎర్రవారిపాలెం 2.6, సూళ్లూరుపేట 2.4, తిరుపతి రూరల్, సత్యవేడు 2.4, పిచ్చాటూరు 2.4, కెవిబి.పురం, పుత్తూరు 1.6, వరదయ్యపాలెం 1.4 వర్షపాతం నమోదు అయినట్లు అధికారులు పేర్కొన్నారు.

నేడు ఆణివార ఆస్థానం

ప్రజాశక్తి- తిరుమల: శ్రీవారి ఆలయంలో 16వ తేదీ మంగళవారం ఆణివార ఆస్థానం పర్వదినాన్ని వైభవంగా నిర్వహించనున్నారు. ఈ ఉత్సవంలో భాగంగా సర్వభూపాల వాహనంలో శ్రీదేవీ భూదేవీ సమేత మలయప్పస్వామిని బంగారువాకిలి ముందు ఉన్న ఘంటా మండపంలో తీసుకురానున్నారు. అలాగే ఉత్సవమూర్తులతో పాటు ఆనంద నిలయంలోని మూలవిరాట్టుకు ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేయనున్నారు. సాయంత్రం 6 గంటలకు పుష్ప పల్లకిలో శ్రీదేవి భూదేవి సమేత మలయప్ప స్వామి తిరుమాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఆణివార ఆస్థానం నేపథ్యంలో శ్రీవారి ఆలయంలో అష్టదళ పాదపద్మారాధన, కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది. అలాగే వీఐపీ బ్రేక్ దర్శనాలను రద్దు చేసింది. సోమవారం సిఫార్సు లేఖల స్వీకరణను కూడా టీటీడీ రద్దు చేసింది.

ముడి సరుకుల నాణ్యత పరిశోధనకు ప్రత్యేక ల్యాబ్

ప్రజాశక్తి- తిరుమల: తిరుమలకు ప్రతిరోజు శ్రీవారి దర్శనార్థం విచ్చేసి వేలాదిమంది భక్తులకు టీటీడీ అందిస్తున్న అన్న ప్రసాదాల ముడి సరుకులు ఎఫ్ఎస్ఎస్ఏఐ వారి సహకారంతో మరింత నాణ్యతతో కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఈవో అధికారులను ఆదేశించారు. అదేవిధంగా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్స్ ఆఫ్ ఇండియా సహకారంతో తిరుమలలో అత్యాధునిక పరిశోధనా కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు టీటీడీ ఈవో జె.శ్యామలరావు చెప్పారు. తిరుపతి టీటీడీ పరిపాలన భవనంలోని ఈవో కార్యాలయంలో సోమవారం ఎఫ్ఎస్ఎస్ఏఐ, టీటీడీ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈవో మాట్లాడుతూ, తిరుమలకు విచ్చేసే భక్తులకు అందించే ఆహార పదార్థాలలో వినియోగించే ముడి సరుకులను వివిధ టెండర్ల ద్వారా టీటీడీ కొనుగోలు చేస్తోందన్నారు. వీటి నాణ్యతను పెంచేందుకు అత్యాధునికమైన పరిశోధన కేంద్రంను ఎఫ్ఎస్ఎస్ఏఐ సహకారంతో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. టీటీడీ కొనుగోలు చేస్తున్న వివిధ ముడిసరుకులు అత్యంత నాణ్యతతో ఉండడానికి గాను, వాటిని పరీక్షించేందుకు తిరుమలలో ఇంటిగ్రేటెడ్ ఫుడ్ లాబోరేటరీ మరింత పారదర్శకంగా నాణ్యతను పరిశీలించేందుకు వీలవుతుందన్నారు. తిరుమలలో భక్తులకు అందిస్తున్న జలప్రసాదం నాణ్యత, వంటశాలలను ఎప్పటికప్పుడు పరీక్షించడం జరుగుతోందన్నారు. ముడి సరుకుల కొనుగోలుకు సంబంధించి ఎస్ఓపిని తయారు చేయాలని జేఈవోను ఆయన కోరారు. భక్తులకు అందించే అన్న ప్రసాద భవనంలో పనిచేసే సిబ్బందికి శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. తిరుమలలో ప్రత్యేకంగా ఎఫ్ఎస్ఎస్ఏఐ ల్యాబ్‌ను ఏర్పాటు చేసేందుకు అవసరమైన స్థలాన్ని ఇవ్వాలని జేఈవోను ఆదేశించారు. ఈ సందర్భంగా న్యూఢిల్లీకి చెందిన ఎఫ్ఎస్ఎస్ఏఐ సీఈవో కమలవర్ధన్ రావు ఆదేశాల మేరకు, ఫుడ్ సేఫ్టీ ఆఫ్ ఫుడ్ సేఫ్టీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ డాక్టర్ పూర్ణచంద్రరావు తిరుమలలో భక్తులకు అందిస్తున్న అన్న ప్రసాదాలు, జలప్రసాదం తదితర అంశాలపై జాగ్రత్తలను, అదేవిధంగా నాణ్యత పెంచడానికి అవసరమైన సూచనలను ఈవోకు వివరించారు. సమావేశంలో జేఈవో గౌతమి, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ అండ్ ఫాస్ట్ ట్రాక్ నోడల్ అధికారి రవీంద్రారెడ్డి, డిప్యూటీ డైరెక్టర్ ఎఫ్ఎస్ఎస్ఏఐ అధికారి బాలు నాయక్, టీటీడీ సిఈ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రసవత్తరంగా మారుతున్న

ఆఫీసర్ల క్లబ్ ఎన్నికలు

- ఓటు హక్కులేని బయటి వ్యక్తుల రాజకీయం
- క్లబ్ ఐక్యత దెబ్బతీనే ప్రమాదం
- మేధావులు మేలుకోవాలంటున్న సభ్యులు



ప్రజాశక్తి- తిరుపతి టౌన్

తిరుపతి సాంస్కృతిక యూనివర్సిటీ సమీపంలో ఉన్న ఆఫీసర్స్ క్లబ్ అంటే ఎంతో గౌరవం కలిగిన క్లబ్. ఈ నెల 21వ తేదీ ఆఫీసర్స్ క్లబ్ ఎన్నికలు జరుగనున్నాయి.. ప్రతి రెండు సంవత్సరాలకు ఓసారి ఎన్నికలు సజావుగా ప్రశాంతం వాతావరణంలో జరిగేవి.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆఫీసర్ క్లబ్‌పై పెత్తనం చేసేందుకు కొందరు బయట వ్యక్తులు రాజకీయం చేయడంతో ఈ ఎన్నికలు రసవత్తరంగా మారుతున్నాయి.

ఈ క్లబ్‌లో ఉండే సభ్యులకు నగరంలో ఎంతో గౌరవం ఇస్తారు. ఆఫీసర్ క్లబ్లో ఎక్కువగా గెజిటెడ్ హోదా కలిగిన వారికి గౌరవ మర్యాదలు ఎక్కువ. క్లబ్లో మొత్తం 520 మంది సభ్యులు ఉన్నారు. ఆఫీసర్ క్లబ్ పరిధిలో ఓ కళ్యాణ మండపంతో పాటు 21 గదులు ఉన్నాయి. వీటిని అద్దెకు ఇవ్వడం వలన సంవత్సరానికి ఎంత లేదన్నా రూ.50లక్షలు ఆదాయం వస్తున్నట్లు సమాచారం. వచ్చిన ఆదాయాన్ని ఆఫీసర్ క్లబ్ అభివృద్ధికి ఖర్చు చేస్తున్నారు. అయితే ఈసారి ఎన్నడూ లేనివిధంగా బయట వ్యక్తులు ఆఫీసర్ క్లబ్‌పై పెతనం చేసేందుకు రాజకీయాలు చేస్తున్నారు. ఇక్కడ రెండు ప్యానల్ మాత్రమే పోటీలో ఉంటాయి. అయితే ఇక్కడ పోటీ చేసేవారు బయట వ్యక్తులు చొరబడి వారికి కావలసిన వారిని గెలిపించుకోవడానికి రాజకీయ ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఎన్నడూ లేనివిధంగా బయట వ్యక్తులు ఎన్నికల్లో జోక్యం చేసుకోవడం వల్ల ఆఫీసర్ క్లబ్ అభ్యున్నతికి ప్రమాదం వాటిల్లే ప్రమాదం పొంచి ఉంది. ఈ క్లబ్‌లో బయట వ్యక్తుల జోక్యం పెరిగితే క్లబ్బు మనుగడ సాధించడం కూడా కష్టంగా మారే అవకాశాలున్నాయని పలువురు అంటున్నారు.

తిరుపతి నగరంలో ఆఫీసర్ క్లబ్ అనేక కార్యక్రమాలు నిర్వహిస్తూ ముందుకు సాగుతోంది, దీంతో పాటు అనేక సేవా కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం క్లబ్ సాంస్కృతిక కార్యక్రమాలకు నిలయంగా ఉంది. ఈ క్లబ్‌లో రక్తదాన శిబిరంతో పాటు పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం, సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటపాటలు లాంటి అనేక కార్యక్రమాలు ఆఫీసర్ క్లబ్ సభ్యులు నిర్వహిస్తూ ఉంటారు. ఈ ఏడాది గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు కూడా నిర్వహించనున్నారు. రాజకీయాలకు అతీతంగా జరిగే ఈ ఎన్నికల్లో బయట వ్యక్తులు జోక్యం చేసుకోవడం వల్ల క్లబ్‌లో జరిగే కార్యక్రమాలపై కూడా ఆ ప్రభావం పడే అవకాశం ఉందని పలువురు గెజిటెడ్ హోదా కలిగిన సభ్యులు అంటున్నారు.

రాజకీయ నేతలు ఈఎన్నికల్లో జోక్యం చేసుకోవద్దని క్లబ్ సభ్యులు వేడుకుంటున్నారు. ఆఫీసర్స్ క్లబ్ 1975 సంవత్సరం ఆగస్టు 18వ తేదీన ఏర్పాటు చేశారు. అప్పటి టిటిడి ఈవో రాజగోపాల్ మొదటి అధ్యక్షులుగా పనిచేయడం విశేషం. ఎంతోమంది సభ్యులు దీన్ని గౌరవం కాపాడుతూ వస్తున్నారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా రాజకీయాలకు అతీతంగా ఎన్నికలు నిర్వహించి గౌరవప్రదమైన సభ్యులను ఎన్నుకునే వారు. సభ్యులు కూడా గౌరవమర్యాదలు కలిగి ఉండేవారు. కొన్ని సందర్భాల్లో ఆఫీసర్ క్లబ్ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగేది. గత నాలుగు సంవత్సరాల నుంచి రెండు ప్యానల్ మధ్య పోటీ ఎక్కువ ఉండడంతో ఎన్నికలు నిర్వహిస్తున్నారు. ఆఫీసర్ క్లబ్ ఆదాయం బాగా ఉండడంతో బయట వ్యక్తులు దీనిపై కన్నేసినట్టు అనుమానాలు కలుగుతున్నాయి. ఎన్నికల్లో మేధావులు బయట వ్యక్తులకు జోక్యం లేకుండా రాజకీయాలకు అతీతంగా ఎన్నికల్లో పాల్గొని ప్రశాంతంగా నిర్వహించాలని సభ్యులు కోరుతున్నారు.

చిన్నారులపై అత్యాచారాలను అరికట్టాలి: ఎస్ఎఫ్ఐ, ఐద్వా



ప్రజాశక్తి- క్యాంపస్: చిన్నారులపై అత్యాచారాలకు వ్యతిరేకంగా, బాలికలకు రక్షణ కల్పించాలని వాసంతి కుటుంబంకు న్యాయం చేయాలనీ డిమాండ్ చేస్తూ ఎంఆర్ పల్లి సర్కిల్ దండి మార్చ్ దగ్గర ఎస్ఎఫ్ఐ, ఐద్వా ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. చిన్నారి వాసంతి మృతికి కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు. ఐద్వా జిల్లా కార్యదర్శి సాయి లక్ష్మి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రవి మాట్లాడుతూ రాష్ట్రంలో గత రెండు వారాలుగా వరుసగా చిన్నారులపై అత్యాచారాలు పెరిగిపోవడం సిగ్గుచేటని అన్నారు. నంద్యాల జిల్లాలో చిన్నారి వాసంతి మిస్సింగ్ కేసు ఛేధించడంలో అధికారుల నిర్లక్ష్యం ఎంతగా ఉందో తెలుస్తోందన్నారు. ఏర్పేడు చిన్నారిపై జరిగిన లైంగిక దాడి ఘటన దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాల స్థాయిలోనే మహిళలను గౌరవించే విధంగా, విలువ ఇచ్చే విదంగా పాఠ్యంశాలు ఉండాలన్నారు. మహిళలపై దాడులు, అత్యాచారాలు విపరీతంగా పెరిగిపోతున్నాయి కానీ శిక్షలు మాత్రం నామామాత్రంగా నమోదు అవుతున్నాయని ఇక అత్యాచారాలను ఎలా అరికడుతారని ప్రశ్నించారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం చిన్నారులు, మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు అరికట్టే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఐద్వా జిల్లా అధ్యక్షులు జయంతి, ఎస్ఎఫ్ఐ నాయకులు వినోద్, తేజ భార్గవ్, నరేంద్ర, శ్రీనివాస్, గణేష్, హర్షద్ పాల్గొన్నారు.

రోజూ ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్: మేయర్

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: నగరంలో పరిసరాల పరిశుభ్రత, పారిశుధ్యం కోసం రోజూ ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించాలని 27వ డివిజన్ సచివాలయ సిబ్బందిని నగర మేయర్ డాక్టర్ శిరిషా ఆదేశించారు. సోమవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో మేయర్ ఛాంబర్‌లో వార్డు సచివాలయ సిబ్బందితో మేయర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మేయర్ మాట్లాడుతూ రాబోయే వర్షాకాలం సందర్భంగా ముందస్తు చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఇంటింటికి వెళ్లి పరిశుభ్రత పాటించాలని తెలియజేయాలని, వర్షాకాలంలో డయేరియా, మలేరియా, డెంగీ, చికెన్ గునియా వంటి రోగాల బారిన పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెద్ద కాలువలు, చిన్న కాలువలు తరచూ శుభ్రం చేయించాలని, ఇంటి సమీపంలో నీరు నిల్వలేకుండా చూడాలని, దోమలు వ్యాపించకుండా దోమల మందు స్ప్రే చేయించాలని అలాగే ప్రతిరోజు ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించాలని తెలిపారు. అలాగే నగర ప్రజలు ఇంటి పరిసరాలు, కాలువలు శుభ్రంగా ఉంచుకోవాలని, కాచిన వేడి నీళ్లు తాగాలని సూచించారు. నగరంలోని ఇంటి వద్ద తాగునీరులో మురుగునీరు కలిసి కలుషితం అయినట్లు తెలిసిన వెంటనే తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్ లైన్‌కు నెంబర్‌కు 0877 2256766కు ద్వారా ఫిర్యాదులు చేయవచ్చు అని తెలిపారు. గోపాలకృష్ణ, పల్లవి, వాసు, మాధవి, హరిత, ఉష, రేవతి పాల్గొన్నారు.

ఇసుకను ప్రజలకు అందుబాటులోకి తేవాలి

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వందవాసి నాగరాజు

ప్రజాశక్తి -గూడూరు టౌన్

ఇసుకను సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వందవాసి నాగరాజు డిమాండ్ చేశారు. సోమవారం గూడూరు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇసుకను అధిక ధరలతో విక్రయించి సామాన్య ప్రజలపై భారం మోపిందన్నారు. ఎన్నికల ముందు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా ఇసుకను ఇస్తానని హామీ ఇచ్చి నేడు రవాణా, మైంటైన్స్ చార్జీల పేరుతో ఇసుకను అధిక ధరకు విక్రయిస్తున్నారని విమర్శించారు. ఇసుక వలన భవననిర్మాణ రంగం కుదేలవుతోందని, భవన నిర్మాణ రంగంలో పనిచేసే కార్మికులు నానా అవస్థలు పడుతున్నారన్నారు. గూడూరు నియోజకవర్గం దగ్గర్లో ఉన్న ఇసుక రీచ్‌లను పరిశీలించి ఇసుకను ప్రభుత్వం ప్రజలకు త్వరితగతిన సరఫరా చేయాలన్నారు. ఇకనైనా రాష్ట్రప్రభుత్వం ఇసుకను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో భవన నిర్మాణ సంఘం నాయకులు పుట్టా శంకరయ్య, జోగి శివకుమార్, సిఐటియు నాయకులు సురేష్, శ్రీనివాస్, అడపాల ప్రసాద్, బివి.రమణయ్య, బి.చంద్రయ్య పాల్గొన్నారు.



పారిశుధ్యం పై అవగాహన



ప్రజాశక్తి- తిరుపతి సిటీ: తిరుపతి అర్బన్ మండలం శెట్టిపల్లి గ్రామంలో సోమవారం పారిశుధ్యం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మెడికల్ ఆఫీసర్ స్రవంతి మాట్లాడుతూ శెట్టిపల్లి గ్రామంలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉందని, దీనివల్ల విషజ్వరాలు వస్తున్నాయంటూ కొన్ని తప్పుడు అపోహాలు వార్తలని ఖండించారు. శెట్టిపల్లి గ్రామంలో ఎలాంటి విషజ్వరాలు, అంటువ్యాధులు లేవని తెలిపారు. ప్రతివీధి తిరిగి గ్రామంలో అవగాహన సదస్సు నిర్వహించారు. వైద్య సిబ్బంది రామకృష్ణ, వెంకటయ్య, మురళి నాగమ్మ, చందన, జనసేన పార్టీ ఇంచార్జ్ నాగార్జున, చరణ్ పాల్గొన్నారు.

బడి బయట పిల్లలను బడిలో చేర్పించాలి

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బడి బయట పిల్లలను బడిలో చేర్పించాలని ఎంఈవో మునిసుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. మండలంలోని పుత్తేరి పంచాయతీలోని ఎంపిపి పాఠశాలలో సోమవారం ఎంఈవో ఆధ్వర్యంలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మునిసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలకు వెళుతున్న విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి ప్రభుత్వ బడిలో విద్యార్థులను చేర్పించి వారి పేర్లు నమోదు చేయాలన్నారు. ప్రైవేటు పాఠశాలకు వెళ్ళే పిల్లలని తిరిగి ప్రభుత్వ బడిలో చేర్పించారని, ప్రభుత్వ బడిలో విద్యార్థులకు ఇచ్చే విద్యా కానుక, యూనిఫాం, బెస్ట్ బుక్స్, నోట్‌బుక్స్, ఇతర వసతుల గురించి తల్లి దండ్రులకు వివరించారు. అనంతరం బుచ్చినాయుడు కండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అందించిన బ్యాగ్స్ గురించి క్లుప్తంగా వివరించి వాటి వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే రమణయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధుడు మృతి

ప్రజాశక్తి -రామచంద్రాపురం(చంద్రగిరి): మండలంలోని చిన్నరామాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని పాతపేట వారి పల్లిలో శతాధిక వృద్ధుడు, టిడిపి సీనియర్ నాయకులు అబ్బూరి నాగుల నాయుడు (101) ఆదివారం సాయంత్రం మృతి చెందారు. ఆయనకి నలుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఆయన మృతిపట్ల టిడిపి మండల నాయకులు పల్లినేని సుబ్రహ్మణ్యం నాయుడు, నారా ప్రకాష్ నాయుడు, లంకెల లలిత తమ సంతాపం తెలిపారు. విషయం తెలుసుకున్న చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని వారి కుటుంబ సభ్యులకి ఫోన్ చేసి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

విద్యార్థులకు నగదు పంపిణీ

ప్రజాశక్తి - ఓజిలి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు భవిష్యత్తులో అత్యున్నత స్థానాలు అధిరోహించాలని స్ఫూర్తి సేవ సమితి అధ్యక్షులు దొమ్మరాజు దామోదర్ రాజు, ఉపాధ్యాయులు కొండూరు దామోదర్ రాజు పేర్కొన్నారు. ఓజిలి మండలంలోని చిల్లమానుచేను , ఆర్మేనుపాడు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించిన పదవ తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఆరుగురు విద్యార్థులకు స్ఫూర్తి సేవ సంస్థ ఆధ్వర్యంలో రూ.ఐదు వేలు, రూ.నాలుగు వేలు, రూ.రెండు వేలు చొప్పున నగదు బహుమతి అందించారు. ఈ సందర్భంగా స్ఫూర్తి సేవా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మట్టిలో మాణిక్యాలని, ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యతో పాటు క్రమశిక్షణ, సామాజిక విలువలు నేర్పిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో చిల్లమానుచేను గ్రామ సర్పంచ్ సాయిరాం, గున్నం సేవ ట్రస్ట్ మేనేజర్ రవీంద్ర రెడ్డి, స్ఫూర్తి సేవ సమితి కార్యవర్గ సభ్యులు నంది మాల బాలకృష్ణ రాజు , లక్ష్మీనారాయణ రాజు పాల్గొన్నారు.

హెల్మెట్ పై అవగాహన

ప్రజాశక్తి - గూడూరు టౌన్: 'హెల్మెట్ ధరించండి ప్రాణాలు కాపాడుకోండి..' అంటూ జూనియర్ సివిల్ జడ్జి లోకనాథం పేర్కొన్నారు. గూడూరు పురపాలక పరిధిలోని చెన్నూరు లో వాహనదారులకు హెల్మెట్‌పై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనం పై ప్రయాణం చేసేటప్పుడు ప్రతీ ఒక్కరూ హెల్మెట్ ధరించాలని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాపాయం నుండి బయట పడేందుకు హెల్మెట్ ఎలా ఉపయోగపడుతుందో వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ మనోజ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.


డెంగీకి ఔషధం కొబ్బరి నూనె

ప్రజాశక్తి -బుచ్చినాయుడు కండ్రిగ: డెంగీ జ్వరం విస్తరిస్తోందని, కొబ్బరి నూనెను మోకాళ్ల నుండి మీ కాళ్ల వరకు రాయాలని, ఇది ఉదయం నుంచి రాత్రి వరకు యాంటీ బయాటిక్ పొరలా పని చేస్తుందని, డెంగ్యూ దోమ మోకాలి ఎత్తు కంటే ఎక్కువ ఎగరదని, ఎవరైనా డెంగ్యూతో బాధపడుతున్నట్లయితే, పచ్చి బొప్పాయి ఆకుల గింజలను నోటికి రెండు వైపులా ఉంచుకోవాలని, వాటిని నమలకుండా జాగ్రత్త వహించాలన్నారు. ఫాల్సీ నోటిలో ఉంచడం ద్వారా, రక్త కణాలు నార్మల్‌గా మారతాయని, ప్లేట్లెట్స్ వెంటనే పెరుగుతాయన్నారు. ఈ సందేశాన్ని అందరికీ పంపాలని వినయ పూర్వకంగా సూచించారు. డెంగీని 48 గంటల్లో నిర్మూలించవచ్చని తెలిపారు. ఎవరైనా డెంగీ, సాధారణ జ్వరం కారణంగా ప్లేట్లెట్స్ తక్కువగా ఉంటే యుపటోరియం పర్ఫ్యాయం 200 లిక్విడ్ డైల్యూషన్ హోమియోపతి ఔషధం ప్రతి 2 గంటలకు మామూలు నీటిలో 3 లేదా 4 చుక్కలు వేసి 2 రోజులు మాత్రమే తాగాలని సూచించారు. ఇలా చేస్తే డెంగీని సులభంగా అరికట్టవచ్చని ఆయన పేర్కొన్నారు.

దుకాణ సముదాయం తొలగింపునకు నోటీసులు


తొలగించనున్న దుకాణ సముదాయం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మంగళం పరిధిలోని సప్తగిరి కాలనీ గ్రామపంచాయతీలోని తిరుపతి-కరకంబాడి రాష్ట్ర రహదారికి ఆనుకొని ఉన్న వెంకటేశ్వర కాలనీ వద్ద ఇటీవల నిర్మించిన దుకాణ సముదాయాన్ని తొలగిస్తున్నామని పంచాయతీ కార్యదర్శి విజయ్ భాస్కర్ సంబంధిత దుకాణాల నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు. ఈ భూమి గతంలో గెజిటెడ్ ఆఫీసర్స్ లేఔట్ లో భాగంగా పంచాయతీకి రిజిస్టర్ చేయబడినట్టు సమాచారం. మంగళం పరిధిలోని సర్వేనెంబర్ 2/1లోని ఈ భూమిలో గత ప్రభుత్వ హయాంలో దుకాణాల సముదాయాన్ని నిర్మించారు. ఇటీవల ఐదు రోజుల క్రితం ఈ దుకాణ సముదాయానికి విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్తు కనెక్షన్లను తొలగించారు. దుకాణాల సముదాయాన్ని కూల్చి వేసే సమయంలో దుకాణ నిర్వాహకులు పంచాయతీ, రెవెన్యూ, పోలీస్ అధికారులకు సహకరించాలని పంచాయతీ కార్యదర్శి విజయ భాస్కర్ నోటిసుల్లో పేర్కొన్నారు.


దుకాణ సముదాయానికి నోటీసు అంటించిన దృశ్యం

పూలే 'ఉచిత ట్యూషన్ సెంటర్' ప్రారంభం!

ప్రజాశక్తి-రేణిగుంట: రేణిగుంట ఏఎన్ఆర్ కాలనీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 1వ తరగతి నుండి 5వ తరగతి పేద విద్యార్థులకు తిరుపతి వేమన విజ్ఞాన కేంద్రం , జన విజ్ఞాన వేదిక రేణిగుంట మండల నాయకులు ఓ వెంకటరమణ, కుప్పస్వామి, ఇమామ్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం ఐదు గంటల కు 'సావిత్రిబాయి పూలే ఉచిత ట్యూషన్ సెంటర్' ను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తిరుపతి బాలోత్సవం గౌరవ అధ్యక్షులు టెంకాయల దామోదరం, తిరుపతి వేమన విజ్ఞాన కేంద్రం ప్రధాన కార్యదర్శి మల్లారపు నాగార్జున, బాలోత్సవం అధ్యక్షులు నడ్డి నారాయణ, జన విజ్ఞాన వేదిక నాయకులు ఎండి రఫీ, లెక్కలు మాస్టర్ అల్లాబక్ష, ఆర్పిఎఫ్ ఏఎస్ఐ నాగేశ్వరరావు, హెల్పింగ్ టు అదర్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు మణికంఠ, రఘునాథ్, మదన్మోహన్, స్ఫూర్తి ఎడ్యుకేషన్ ట్రస్ట్ సుబ్రహ్మణ్యం, తహసిన్నిసా, ఏఎన్ఆర్ కాలనీ ప్రధానోపాధ్యాయురాలు వసుమతి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఐదు నెలల బకాయి జీతాలు చెల్లించాలి

- ఉపాధి భద్రత కల్పించాలి
- గ్రీన్ అంబాసిడర్ వర్కర్స్ యూనియన్ డిమాండు


మాట్లాడుతున్న సిఐటియు మండల అధ్యక్షులు రమేష్

ప్రజాశక్తి - సత్యవేడు: మండలంలో గ్రీన్ అంబాసిడర్లకు 45 నెలలుగా అందించాల్సిన బకాయి జీతాలు వెంటనే చెల్లించి ఉద్యోగ భద్రత కల్పించాలని గ్రీన్ అంబాసిడర్ వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండు చేశారు. సత్యవేడు మండల కేంద్రంలో సిఐటియు కార్యాలయంలో గ్రీన్ అంబాసిడర్ వర్కర్స్ యూనియన్ మండల కమిటీ సభ్యులు ఉద్యోగ భద్రత, ప్రభుత్వం చెల్లించవలసిన 45 నెలల బకాయి జీతాలపై సత్యవేడు మండల సిఐటియు అధ్యక్షులు మెలుగు రమేష్ అధ్యక్షతన సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రీన్ అంబాసిడర్ వర్కర్స్ యూనియన్ మండల కమిటీ అధ్యక్షులు శేఖర్, కార్యదర్శి మునస్వామి మాట్లాడుతూ 2017 సంవత్సరం స్వచ్ఛభారత్‌లో గ్రీన్ అంబాసిడర్ సంస్థ ద్వారా గ్రామాల పరిశుభ్రత కోసం వర్కర్స్ ను ఏర్పాటు చేసి వారికి వేతనం 6 వేలుగా అప్పటి కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నియమించాయి. అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం కార్మికుల జీతాలు సజావుగా చెల్లిస్తూ వచ్చారని, 2019 ఎన్నికలలో గెలుపొందిన కొత్త ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఇంత వరకు 45 నెలలుగా తమకు జీతాలు అందక బకాయి పడ్డారన్నారు. ఎలాంటి ఉద్యోగ భద్రత చర్యలు చేపట్టలేదని తెలిపారు. కరోనా సమయంలో ప్రభుత్వం జీతాలు చెల్లించినప్పటికీ గ్రామాలలోని పారిశుద్ధ్య కార్మికులు తమ ప్రాణాలను అడ్డుపెట్టి పారిశుద్ధ్య పనులను నిర్విరామంగా చేసినప్పటికీ అప్పటి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఎలాంటి సహాయం అందించ కుండా నిస్సారానికి మాత్రమే పరిమితం చేశారని తెలిపారు. గ్రీన్ అంబాసిడర్ జీవితాలు దుర్భర స్థితికి చేరుకు న్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత ముఖ్య మంత్రి చంద్రబాబు చేతుల మీదుగా ప్రారంభం చిన స్వచ్ఛ భారత్ గ్రామీణ పథకం కనుక గ్రీన్ అంబాసిడర్ల గోడును ముఖ్యమంత్రి పట్టించుకుని వెంటనే యుద్ధ ప్రాతిపదికన ఆగిన 45 నెల జీతాలను చెల్లించి, ఉద్యోగ భద్రతను కల్పించి ఆదుకోవాలని కోరారు. ఈ సమావేశంలో సిఐటియు సత్యవేడు మండల అధ్యక్షులు మెలుగు రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే గ్రీన్ అంబాసిడర్లకు బకాయి జీతాలు చెల్లించి ఉపాధి భద్రతను కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మునస్వామి శేఖర్,సుబ్రహ్మణ్యం, చంద్రబాబు, రాజేంద్రన్, మారి, కిస్టన్, వేలయ్య పాల్గొన్నారు

చంద్రగిరి అభివృద్ధికి సహకరించండి

మోహన్ బాబుకి ఎమ్మెల్యే వినతి

ప్రజాశక్తి - రామచంద్రాపురం (చంద్రగిరి): చంద్రగిరి నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని మోహన్ బాబు విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఎం మోహన్ బాబుని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని కోరారు. మండలంలోని, ఏ రంగం పేట సమీపంలోని ఎంబియు వ్యవస్థాపకులు, ప్రముఖ సినిమా హీరో మంచు మోహన్ బాబుని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని సోమవారం ఉదయం మర్యాద పూర్వకంగా కలిశారు. మోహన్ బాబు ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే నాని విద్యానికేతన్ లోని మోహన్ బాబు నివాసంలో కలిశారు. మోహన్ బాబు ఎమ్మెల్యే నానికి శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. ఒకరి నొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కొంత సమయం పిచ్చాపాటి మాట్లాడుకున్నారు. ఇద్దరూ కలిసి అల్పాహారం స్వీకరించారు. ఎన్నో ఆటుపోట్లకు తట్టుకొని ఎమ్మెల్యేగా గెలవడం ఎంతో సంతోషంగా ఉందని మోహన్ బాబు అన్నారు. సామాజిక సేవలో తాను ఎప్పుడూ ముందు ఉంటానని చంద్రగిరి అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని మోహన్ బాబు ఎమ్మెల్యే నానికి మాట ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ముడిపల్లి సురేష్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు పి సుబ్రహ్మణ్యం నాయుడు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి హేమాంబరధరావు, ఏజెపల్లి బాల, గౌస్ బాషా బెల్లంకొండ రమేష్, కె దేవిలాల్ , కే భూపతి, వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.


ఎమ్మెల్యే పులివర్తి నానిని అభినందిస్తున్న మోహన్‌బాబు

గిరిజనులకు భూములు కల్పించాలి: సిపిఎం

ప్రజాశక్తి - ఓజిలి: భూములు లేని నిరుపేద గిరిజనులకు భూములు కల్పించాలని కోరుతూ ఓజిలి మండల తహశీల్దారు కార్యాలయం ఎదుట సిపిఎం ఆధ్వర్యంలో గిరిజనులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు శివకవి ముకుంద మాట్లాడుతూ ఓజిలి మండలంలోని కుందాం రాజుపాలెం గ్రామంలో 25 గిరిజన కుటుంబాలు కొన్ని సంవత్సరాలుగా జీవనం సాగిస్తున్నాయని, వీరికి జీవనోపాధి లేక జీవనం దుర్భరంగా మారడంతో సాగు భూముల కోసం గత కొన్నేళ్లగా అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా అధికారులలో చలనం లేదని తెలిపారు. ఓజిలి మండలం కుందాం రెవెన్యూలో సర్వే నంబరు 1 లో వందలాది ఎకరాల మేత పోరంబోకు భూమి కలిగి ఉందని రాజుపాళెం గ్రామ స్థానిక గిరిజనులకు సంబంధిత అధికారులు భూములు కల్పించకపోవడం దారుణమని పేర్కొన్నారు. అదే గ్రామంలో పెత్తం దారులు వందలాది ఎకరాలు సాగు భూమి చేసుకుంటున్నా గిరిజనులకు మాత్రం ఇవ్వకపోవడం రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యానికి నిద ర్శనమని తెలిపారు. గిరిజన కుటుంబాలకు జీవనాధారం లేక రోజువారి కూలి పని చేసుకుంటూ జీవనాధారం కొనసాగిస్తున్నారని, ఏ ఆధారం లేని గిరిజన కుటుంబాలకు సాగు భూములు కల్పిస్తే వారి జీవనం మెరుగు పడుతుందని తెలిపారు. గిరిజనులకు సాగు భూములు లేక వలసలు వెళుతున్నారని, ఈ వలసలను అరికట్టేందుకు గిరిజన రైతులకు సాగుభూమి కల్పించి వారికి జీవనోపాధికి తోడ్పడాలని పలుమార్లు అధికారులు దృష్టికి తెలిపినా అధికారులలో చలనం లేదని మండి పడ్డారు. గిరిజన రైతులకు సాగు భూములు కల్పించని పక్షంలో ఉద్యమాలు చేపడు తామని హెచ్చరించారు. ఈ నిరసనలో గిరిజన రైతులు పాల్గొన్నారు.


సిపిఎం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేస్తున్న గిరిజనులు

పేదల ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యత

గ్రామాలలో ఉచిత వైద్యశిబిరాల ఏర్పాటుకు స్విమ్స్ సహకారం కోరిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి- తిరుపతి సిటీ, రామచంద్రాపురం : చంద్రగిరి నియోజకవర్గంలోని పేద ప్రజల ఆరోగ్య సంరక్షణ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. చంద్రగిరి నియోజకవర్గం, తిరుపతి రూరల్ మండలంలోని వెంకటపతి నగర్‌లో సోమవారం స్విమ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో ఎమ్మెల్యే నాని పాల్గొన్నారు. వైద్యశిబిరంలో వైద్యులు ప్రజలకు ఉచితంగా వివిధ రకాల వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్యం అవసరమైన వారిని గుర్తించి ఆసుపత్రికి రెఫర్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమైనందున నియోజకవర్గంలోని అన్ని మండలాలలో వీలైనన్ని వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలన్న తన కోరికను మన్నించి చర్యలు చేపట్టిన స్విమ్స్ డైరెక్టర్, వైస్ ఛాన్సలర్ డాక్టర్ రవికుమార్‌కి కృతజ్ఞతలు తెలిపారు. స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ ఆధునిక వైద్యయంత్రాలు అందుబాటులో ఉన్నాయని ప్రతి ఒక్కరూ స్విమ్స్‌లో అవసరమయ్యే చికిత్సలను పొంది ఆరోగ్యవంతులు కావాలని సూచించారు. స్విమ్స్ వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి: సిపిఎం

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్: కేవిబి పురం మండలంలోని వడ్డీ కండ్రిగ గ్రామంలో పది సంవత్సరాలుగా ఇళ్లు కట్టుకొని నివాసం ఉంటున్నారు వారికి వెళ్లడానికి దారి లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఎంపీడీవో రెడ్డప్పకు సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు పడడంతో బాటలో పిచ్చి మొక్కలు, గడ్డి, గొంతులోతు నీరు నిల్వ వుండి దోమలు వృద్ధి చెంది రాత్రి సమయంలో నరకయాతన చూపిస్తున్నాయని ఇందుకు తోడు వీధిలైట్లు లేక రాత్రి సమయంలో గ్రామస్తులు బయటికి వెళ్లాలంటే బిక్కుబిక్కుమంటూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని జీవిస్తున్నామన్నారు. ఈ విషయంపై పలుమార్లు ప్రజా ప్రతినిధులకు అధికార దృష్టికి తీసుకుని వెళుతున్నా ఏమాత్రం పట్టించుకోవడం లేదని సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం ఎంపీడీవోకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ ఆ గ్రామంలో రోడ్డు, విద్యుత్ లేక గ్రామస్తులు , చిన్నారులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారని ఈ విషయాన్ని వెంటనే పరిష్కరించాలని లేకుంటే పెద్ద ఎత్తున ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వెంకటేశులు, దేశమ్మ, కళావతి, మరియమ్మ పాల్గొన్నారు.

గ్రామాల్లో రోడ్లు అధ్వానం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : నగరి నియోజకవర్గంలో గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు దుస్థితిలో వున్నాయని, అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వాలని పంచాయతీ రాజ్ శాఖ చీఫ్ ఇంజనీర్‌ను నగరి నియోజకవర్గ ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ సోమవారం కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఎక్కడ చూసినా రోడ్లు నిర్మాణం డ్రైనేజీ కాలువలు నిర్మాణం చేయలేక పోయి ప్రజలు ఇబ్బందులకు గురి అవుతున్నారని తెలిపారు. వెంటనే సిసి రోడ్లు అభివృద్ధి రోడ్లు నిర్మాణానికి సహకరించాలని అధికారులకు తెలిపారు. అందుకు స్పందించిన పంచాయతీ రాజ్ శాఖ చీఫ్ ఇంజనీర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, గ్రామీణ శాఖ మంత్రితో చర్చించి నియోజకవర్గంలో రోడ్ల నిర్మాణానికి ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు


పంచాయతీ రాజ్ చీఫ్ ఇంజనీరుకు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే

జాతీయ సంస్కృత వర్సిటీకి నాక్ ఏ ప్లస్ గ్రేడ్

ప్రజాశక్తి - క్యాంపస్: తిరుపతి జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంకు న్యాక్ కమిటీచే ఏ ప్లస్ గ్రేడ్ సాధించినట్లు వర్సిటీ ఉపకులపతి ఆచార్య జిఎస్ఆర్ కృష్ణమూర్తి, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఆర్‌జె.రమాశ్రీ వెల్లడించారు. ఈసందర్భంగా వర్సిటీలోని ఉపకులపతి ఛాంబర్‌లో విలేకర్ల సమావేశాన్ని నిర్వ హిం చారు. వారు మాట్లాడుతూ 2020 సంవత్సరంలో రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠంగా ఉన్నటువంటి ఈ విద్యాపీఠం నేషనల్ సాంస్క్రిట్ యూనివర్సిటీ హోదా వచ్చిన తర్వాత న్యాక్ కమిటీ మూడవ సైకిల్లో ఏ ప్లస్ గ్రేడ్‌ను సాధించిందన్నారు. గత ఐదు సంవత్సరాలుగా విశ్వవిద్యాలయంలో బోధన, బోధనేతర సిబ్బంది పరిశోధకులు విద్యార్థుల సహకారంతో బోధనా రంగంలోనూ, ఇటు పరిశోధన రంగంలోనూ విశేషమైన కృషిని అభివృద్ధిని సాధించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ డీన్ ఆచార్య రజినీకాంత్ శుక్ల, ఐక్యూఏసీ డైరెక్టర్ ఆచార్య సతీష్, పిఆర్ ఆచార్య వి.రమేష్ బాబు, ప్రొఫెసర్లు కె.కాదాంబిని, ఆర్.దీప్త, ఎపిఆర్‌ఓ డాక్టర్ కనపాల కుమార్, డాక్టర్ బుల్టీదాస్, న్యాక్ ఎస్ఎస్ఆర్ కమిటీ సభ్యులు, డివివి కమిటీ సభ్యులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయండి..

మంత్రికి ఎమ్మెల్యే వినతి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : నగరి నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టు నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు సహకరించాలని రాష్ట్ర ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడుని నగరి నియోజకవర్గ ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ సోమవారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరి నియోజకవర్గ సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, చెరువులు, సప్లై ఛానెల్స్ మరమ్మతుల గురించి చర్చించారు. స్పందించిన మంత్రి ప్రాజెక్టు పనులను పూర్తి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుతో దృష్టికి తీసుకెళ్లి పూర్తి చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఆలయ భూములను రక్షించండి


తహశీల్దారుకు వినతి పత్రం అందిస్తున్న గ్రామస్తులు

ప్రజాశక్తి- తిరుపతి డెస్క్: పెళ్లకూరు మండలంలోని ఓ ఆలయానికి చెందిన భూములను కబ్జా కాకుండా రక్షించాలని మండలంలోని తాళ్వాయిపాడు గ్రామస్తులు మండల తహశీల్దారుకు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెళ్లకూరు మండలంలోని తాల్వాయిపాడులో 49 సంవత్స రాలుగా సర్వే నంబర్ 80 -20లో 0.25 సెంట్ల భూమి 1975 సంవత్స రంలో వీరయ్య ఆలయానికి అప్పటి గ్రామ ప్రజలు, గుడి కార్యక్ర మాలు నిర్వహించే పెద్దలకు భూమిని అందించారని పేర్కొ న్నారు. నాయుడుపేట గ్రామానికి చెందిన వాకు చర్ల వెంకట య్య, నరసయ్య దగ్గర కొనుగోలు చేశామని, ఆ పొలాన్ని 2016 సంవత్సరం పక్కనున్న రైతులు అడ్డదారిలో 1- బి, అడంగల్ పాస్ బుక్ పొందారని, విషయం తెలుసుకున్న గ్రామస్తులు అభ్యంతరం తెలపడంతో వారు తహశీల్దారు వద్ద లిఖిత పూర్వకంగా 'ఈ పొలం మాది కాదు' అంటూ ఉపసంహ రించుకున్నారు. కానీ 2022 సంవత్సరం వాకు చర్ల బాలాజీ 'ఈ పొలం మా పెద్దనాన్నది.. నాకు చెందుతుంది..' అంటూ 0.25 సెంట్ల భూమి ఆక్రమణకు ప్రయత్నించగా గ్రామస్తులు అడ్డుకుని మీ పెద్దనాన్నకు వారసుడువని నీకు ఏదైనా లిఖితపూర్వకంగా ఉంటే తీసుకురమ్మని, దీని కొనుగోలు చేసినట్టు తగిన ఆధారాలు ఉన్నాయని అడ్డుకోవడంతో వెనుతిరిగి వెళ్లి ప్రస్తుతం 0.13 సెంట్లు భూమి మళ్లీ అడ్డదారిలో ఆక్రమించే ప్రయత్నంలో ఉన్నాడని అతని బారినుండి ఆలయ స్థలాన్ని పరీ రక్షించి ఆలయ భూములను కాపాడాలని గ్రామస్తులు ఎమ్మార్వో ను వినతిపత్రం ద్వారా అభ్యర్థించారు. సమస్యను విచారించి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

సమస్యలపై కార్పొరేటర్లు ఫిర్యాదు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: నగరపాలక సంస్థ కార్పొరేటర్లు సమస్యలు వచ్చి పడ్డాయి. వారి సమస్యలు పరిష్కారం కాలేదు. వైసిపి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ బడ్జెట్‌కు మించి పనులు చేశారు. వాటి సంబంధించిన బిల్లులు కాంట్రాక్టర్లకు చెల్లించకపోవడంతో ఎక్కడ పనులు అక్కడ కాంట్రాక్టర్లు నిలిపివేశారు. నూతన ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత మీకోసం ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమంలో ఎక్కువ మంది మున్సిపల్ కార్పొరేషన్ లో కార్పొరేటర్‌గా ఉన్నవారు సమస్యలపై కమిషనర్ అదితి సింగ్‌కు సోమవారం వినతి పత్రాలు అందించారు. గతంలో ఉన్న కమిషనర్‌కు కూడా కార్పొరేటర్లు వివిధ సమస్యలపై ఫిర్యాదు చేశారు. కొన్ని మాత్రం పరిష్కరించారు. మిగిలిన వాటి పరిష్కరించక పోవడంతో కార్పొరేటర్ల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజనీర్ తిరుమాలిక మోహన్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి, మునిసిపల్ ఇంజనీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, రెవెన్యూ అధికారులు సేతుమాధవ్, కెఎల్‌వర్మ, డిప్యూటీ సిటీ ప్లానర్ శ్రీనివాసులు రెడ్డి, అడిషనల్ సిటీ ప్లానర్ బాలసుబ్రమణ్యం, మేనేజర్ చిట్టిబాబు, డిఈలు, సూపరింటెండెంట్లు అధికారులు పాల్గొన్నారు.

మంచి లక్షణాలు అలవర్చుకోవాలి

విద్యార్థులకు ఎమ్మెల్యే పులివర్తి నాని ఉద్బోధ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): విద్యార్థి దశ జీవితాన్ని తీర్చిదిద్దే గొప్ప దశ అని ఆ దశలోనే మంచి లక్షణాలను అలవర్చుకోవాలని చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే పులివర్తి నాని ఉద్బోధించారు. మంగళం పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 'నాడు నేడు' రెండవ దశ పనులలో నిర్మితమైన నూతన భవన ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే పులివర్తి నాని భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన అభినందన సభలో ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ ఉపాధ్యాయులకు తాను ఎప్పుడు అందుబాటులో ఉంటూ విద్య వ్యవస్థకు కావలసిన వనరులను ప్రభుత్వం నుండి మంజూరు అయ్యేలా చేస్తానన్నారు. తల్లిదండ్రుల ఆశయాలను గౌరవించి తదనగుణంగా ప్రణాళిక బద్ధంగా విద్యార్థులు వారి విద్యాభ్యాసాన్ని పూర్తిచేసి ఉన్నత భవితకు బాటలు వేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాన్ టీచింగ్ స్టాఫ్‌ను రిక్రూట్ చేయాలని, మరమ్మతులకు గురైన ఆర్వో ప్లాంట్ ను బాగు చేయాలని, పెరుగుతున్న విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా చేపట్టిన గదుల నిర్మాణం పూర్తి చేయించాలని, ఇస్కాన్ ద్వారా సరఫరా అవుతున్న ఆహారంలో నాణ్యత పెంచాలని ఎమ్మెల్యే దృష్టికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సి. కేశవులు నాయుడు తీసుకొచ్చారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే వీటన్నింటినీ అతి త్వరలోనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. 2023-24 విద్యా సంవత్సరంలో 10వ తరగతి పరీక్ష ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పాఠశాలలోని 36 మంది ఉపాధ్యాయులు తమవంతుగా ప్రోత్సాహక నిధి విరాళం దాదాపు 60 నుంచి 70 వేల రూపాయలు సేకరించారు. ఈ సేకరించిన మొత్తంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎంపిక చేసి ఎమ్మెల్యే నాని చేతుల మీదుగా నగదు పురస్కారాన్ని అందించారు. అమరావతి రాజధాని నిర్మాణం కోసం తనవంతుగా పాఠశాల సాంఘిక ఉపాధ్యాయులు కృష్ణమ నాయుడు విరాళంగా 10,1116 రూపాయల చెక్కు రూపంలో ఎమ్మెల్యే పులివర్తి నానికి అందించారు. ఈ కార్యక్రమంలో డిఈవో శేఖర్, ఉప విద్యాశాఖ అధికారి బాలాజీ, నాడు-నేడు ప్రోగ్రాం కోఆర్డినేటర్ రామచంద్ర రెడ్డి, ఎంపీడీవో రమేష్, టిడిపి తిరుపతి రూరల్ మండలం అధ్యక్షులు ఈశ్వర్ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు రామాంజేరి మహేశ్వరి, ప్రధాన కార్యదర్శి గోపీనాథ్, ఉమ్మడి శెట్టిపల్లి పంచాయతీ పార్టీ అధ్యక్షులు ఈశ్వరయ్య, మంగళం పంచాయతీ టీడీపీ అధ్యక్షులు సురేష్, పెరుగు భాస్కర్ రెడ్డి, తిరుమల నగర్ పంచాయతీ అధ్యక్షులు గోవిందరాజులు, కార్యదర్శి చెన్నరాయప్ప, గుళ్ళూరు మణి, మంగళం నాని, అశోక్, వినోద్ పాల్గొన్నారు.



రోడ్డు ప్రమాదంలో తల్లీకూతురు మృతి

మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - ఏర్పేడు: రోడ్డు ప్రమాదంలో తల్లీ కూతురు మృతి చెందగా, ఇద్దరు గాయపడిన సంఘటన ఏర్పేడు మండలంలో సోమవారం చోటుచేసుకుంది. శ్రీకాళహస్తి మండలం రామానుజ పల్లి దళితవాడకు చెందిన బాపన శివకుమార్ భార్య బాపన శారద(22), కుమార్తె గురు వైష్ణవి (2), కుమారుడు గురు కార్తీక్ (4) శారద తల్లి విజయమ్మ (50) రేణిగుంట మండలం మల్లవరం నుంచి ఆదివారం సాయంత్రం శ్రీకాళహస్తి మండలం రామానుజ పల్లికి వెళ్లేందుకు ఏర్పేడు మండలం అముదూర్ క్రాస్ వద్ద బస్సు దిగారు. అక్కడ నుండి రామానుజ పల్లెకు వెళ్లేందుకు ఆటోలు లేకపోవడంతో శారద భర్త శివకుమార్‌కు ఫోన్ చేసి ద్విచక్ర వాహనం తీసుకుని రమ్మని చెప్పి రోడ్డు పక్క సైడ్‌లో వేచి ఉన్నారు. వెంకటగిరి నుండి ఏర్పేడు వైపు అతివేగంగా వస్తున్న ఓ లారీ శారద కుటుంబ సభ్యుల పైకి దూసుకు వెళ్లింది. ఈ ప్రమాదంలో తల్లి శారద, కుమార్తె గురు వైష్ణవి అక్కడికక్కడే మృతి చెందారు. శారదా తల్లి విజయమ్మ, శారద కుమారుడు గురు కార్తీక్ ఇద్దరు గాయపడ్డారు.

స్పందించిన మంత్రి

ఆంధ్రప్రదేశ్ రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి ఏర్పేడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదం గురించి రీజనల్ జేటిసి బసిరెడ్డి ద్వారా వివరాలు తెలుసుకొని, ప్రమాద ప్రాంతాన్ని సందర్శించి ప్రమాదం జరుగడానికి గల కారణాలను తెలపాలని ఆదేశించారు. మంత్రి ఆదేశానుసారం జేటిసి బసిరెడ్డి, శ్రీకాళహస్తి ఎంవిఐ దామోదర్ నాయుడు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు.

ద్విచక్ర వాహనం బోల్తా.. వ్యక్తి మృతి

ప్రజాశక్తి -రామచంద్రాపురం: రాయలచెరువు కట్ట నెత్తకుప్పం ప్రధాన రహదారి ఎన్ ఆర్ కమ్మపల్లి భారత మిట్ట సమీపంలో స్కూటర్ బోల్తా పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు నెత్తకుప్పం దళితవాడకు చెందిన గోపి(36) తన ద్విచక్ర వాహనంపై వర్షం వస్తున్నప్పటికీ ఉదయం 10 గంటలకు కుప్పం బాదూరుకు వెళుతుండగా ఎదురుగా వచ్చిన కారును తప్పించబోయి స్కూటర్ లో బోల్తాపడ్డాడు. ఈ ఘటనలో గోపి తలకి, శరీర అవయవాలకు తీవ్ర గాయాలు కావడంతో కింద పడి స్పృహ కోల్పోయాడు. స్థానికులు గుర్తించి వైద్య సేవల నిమిత్తం ప్రైవేటు వాహనంలో తిరుపతికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఈ విషయంపై పోలీసులు వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ చిరంజీవి తెలిపారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

కలెక్టరుకు భవన నిర్మాణ కార్మిక సంఘం వినతి



ప్రజాశక్తి - తిరుపతి టౌన్: 1214 మెమోను రద్దు చేయాలని, సంక్షేమ బోర్డును పునరుద్ధ రించా లని రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సోమవారం కలెక్టరేట్ ఎదుట భవన నిర్మాణ కార్మికుల సంఘం నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం అధ్యక్షులు అల్లయ్య, ఉపాధ్యక్షులు పి మునిరాజా మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 30 లక్షలకుపైగా భవన నిర్మాణ కార్మికులు ఉన్నారని, వారికి ఆదరణగా ఉన్న సంక్షేమ బోర్డు గత ఐదు సంవత్సరాలుగా పనిచేయడం లేదన్నారు. వెంటనే సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, గతంలో పెండింగ్‌లో ఉన్న క్లైములకు నిధులు కేటాయించాలని, 2019 నుంచి 2024 వరకు జరిగిన ప్రమాదాలను, ఇతర సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు జి బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సంక్షేమ బోర్డును తిరిగి ప్రారంభించాలని లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. అనంతరం కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సుందరం, టి సుబ్రమణ్యం, పార్థసారధి, హరి, నాగరాజు, శంకర్ పాల్గొన్నారు.